క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్రానిది కార్మిక వ్యతిరేక పాలన

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



మాట్లాడుతున్న చంద్రమోహన్

చైతన్యపురి: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ విమర్శించారు. చైతన్యపురి డివిజన్‌లోని కామ్రేడ్ బోడెపుడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. జాతీయ సహజ వనరులు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ఇతర నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని... మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పర్మనెంట్ చేసి రూ.26వేలు చెల్లించాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, నాయకులు కృష్ణయ్య, కడారి రాములు, మల్లేష్, పద్మ, నవనీత, గీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.


త్రివిధ దళాలకు శక్తినివ్వాలని పూజలు


రేణుకాఎల్లమ్మ ఆలయంలో జరిగిన పూజలో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధానికి భారత త్రివిధ దళాలకు శక్తిని, మనోధైర్యాన్ని ప్రసాదించాలని వినాయక్‌నగర్ కాలనీలో రేణుకాఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా పాల్గొని పూజలు చేశారు. భారత ప్రధాని మోదీకి దేశప్రజలు అండగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

దండుమైలారం పంచాయతీ సేవలు భేష్

ఎన్ఐఆర్‌డీ విద్యుల్లత


గ్రామ పంచాయతీ పనితీరును వివరిస్తున్న కార్యదర్శి శివ

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామాన్ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) కోఆర్డినేటర్ విద్యుల్లత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివ గ్రామస్తులకు అందిస్తున్న పంచాయతీ సేవలను, పనితీరును ఆమెకు వివరించారు. ఇంటి నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ తదితర ఆన్‌లైన్ సేవలను ఆమె పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీలోని 380 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆమె బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా దేవితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని మహిళా లోకం డిమాండ్ చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు తుక్కుగూడలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2500లు ఇవ్వాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో కేసీఆర్ హయాంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఆమె గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేశారు కానీ ఈ ప్రభుత్వం వచ్చాక నాట్ గ్రౌండెడ్ అనే నెపంతో రద్దు చేశారన్నారు. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలలో ఓట్లు అడిగేందుకు వెళ్తే ప్రజలు ఎదురుతిరుగుతారనే భయంతోనే నిర్వహించడం లేదని విమర్శించారు. మార్పు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ దమ్ముంటే వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న పార్టీగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు యంజాల జనార్దన్, కైసర్ బామ్, పల్లవు శంకర్, షేక్ అఫ్జల్, అర్జున్, దూడల శ్రీనివాస్‌గౌడ్, గుండు నర్సింగ్, నగేశ్, మతిన్ పటేల్, యూసుఫ్ పటేల్, శంషుద్దీన్, ఎక్బాల్ ఖలీఫా, ఇద్రీస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్మశానవాటికల్లో వసతులు కల్పించండి

మీర్‌పేట: శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీర్‌పేట–1, 2 అధ్యక్షులు భిక్షపతి చారి, ముఖేశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. పెద్దచెరువు, లెనిన్‌నగర్ వాటర్‌ట్యాంక్, జిల్లెలగూడ శ్మశానవాటికలలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి కోసం గతంలో నిధులు విడుదల చేసినప్పటికీ పనులు జరగడం లేదన్నారు. తక్షణమే శ్మశానవాటికల్లో స్నానాల గదులు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, భీంరాజ్, సూల ప్రభాకర్, గోపీనాథ్, రమేశ్, సిద్దాల శ్రీనివాస్ హైందవి ఉన్నారు.

రోహింగ్యాలను గుర్తించాలి

భద్రత దృష్ట్యా మీర్‌పేట ప్రాంతంలో నివాసముంటున్న రోహింగ్యాలను గుర్తించి వారి ఆధార్ కార్డులను పరిశీలించాలని బీజేపీ నాయకులు కోరారు. అనంతరం మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున రోహింగ్యాలను ఇక్కడి నుంచి పంపించాలని కోరారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మకర్త తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వేద పండితుడు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో బ్రాహ్మణులు మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అంతకుముందు హోమాలు, పూర్ణాహుతితో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రేపు గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

మహేశ్వరం: 2025–26 విద్యాసంవత్సరానికి గాను రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల మహేశ్వరం, కందుకూరులో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు పీవీటీజీ బాలుర కళాశాల హయత్‌నగర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, మార్కుల మెమో, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్, స్పోర్ట్స్, అర్ఫాన్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

సమ్మె నోటీస్ అందజేత


ఆర్టీఓకు నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మిక చట్టాలను పరిరక్షించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మన్నెగూడలోని ఆర్టీఓ కార్యాలయంలో ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుభాష్ చంద్రారెడ్డిని, సీఐటీయూ నాయకులు కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు, సీఐటీయూ నాయకులు ఆశీర్వాదం, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



మాట్లాడుతున్న రవీంద్రాచారి

మీర్‌పేట: బాలాపూర్ మండలం జిల్లెలగూడ శాఖ సీపీఐ పార్టీ నూతన కమిటీని మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రమావత్ పాండునాయక్, సహాయ కార్యదర్శులుగా బ్రహ్మచారి, ఎం.కృష్ణ, కౌన్సిల్ సభ్యులుగా దశరథ, శ్రీనివాస్, కే.పద్మ, జంగయ్య జర్పుల శివనాయక్, ఇద్దరు కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం పార్టీ నాయకులు దశరథ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్రాచారి మాట్లాడుతూ.. సీపీఐ ఎల్లప్పుడూ పేదల పక్షాన పోరాడుతుందని, భూపోరాటాల్లో భాగంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో నిర్వహించే ప్రజా పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



ఆమనగల్లు: కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న యాదయ్య


కడ్తాల్: ఎనుగొండ కంటి ఆస్పత్రికి తరలిస్తున్న నిర్వాహకులు

లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య

ఆమనగల్లు: కంటిచూపు మందగించిన వారికి లయన్స్‌క్లబ్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో 40 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతీ నెల కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించడంతో పాటు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నామని వివరించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 45 మందిని కంటి ఆపరేషన్ల కోసం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా, సభ్యులు బాలకృష్ణయ్య, కొండల్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు వైద్యమే లక్ష్యం


కడ్తాల్: పేదలకు వైద్య సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ కంటి ఆస్పత్రి కడ్తాల్ చైర్మన్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నేత్ర పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్ మాట్లాడుతూ.. కడ్తాల్ లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నామన్నారు. చికిత్స అవసరమైన వారికి ఎనుగొండ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నామని చెప్పారు అనంతరం నేత్ర వైద్యులు పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 42 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 15 మందిని గుర్తించి, చికిత్స నిమిత్తం లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఎనుగొండకు తరలించారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


బడిబాట కార్యక్రమంలో కడ్తాల జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని.. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యాబోధన, మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యకు ఇరవై కిలోమీటర్లు


కడ్తాల్ మండల కేంద్రం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- దూరభారంతో పదో తరగతితో ఆపేస్తున్న వైనం
- ఎన్నికల హామీగానే మిగులుతున్న కళాశాల ఏర్పాటు

కడ్తాల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఏళ్ల నుంచి ఎదురుచూపులు తప్పడం లేదు. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రంలో కళాశాల లేక ఇక్కడి పేద నిరుపేదలు పదోతరగతికే పరిమితమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలున్నప్పటికీ ఫీజుల భారంతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. సమీపం మండల కేంద్రం ఆమనగల్లులో ప్రభుత్వ కళాశాల ఉన్నప్పటికీ 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎన్నికల వాగ్దానంగానే మిగిలిపోతోంది.

ఏటా ఆరు వందల మంది విద్యార్థులు

మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రతి ఏటా సుమారు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. వీటితో పాటు నాలుగైదు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో 200మంది వరకు విద్యార్థులు ప్రతి ఏటా పదోతరగతి పరీక్షకు హాజరవుతారు. రావిచేడ్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల్లోనూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలో ప్రతీ సంవత్సరం సుమారు 500నుండి 600 మంది వరకు విద్యార్థులు పదోతరగతి అభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల లేక

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక ఏటా వందలాది మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు స్వస్తి పలుకుతున్నారు. పలువురు సమీప పట్టణాల్లోని ప్రైవేట్ కళాశాలలతో పాటు, కందుకూరు, తుక్కుగూడ, కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల లేక ప్రవేట్ కళాశాలలో ఫీజులు కట్టి చదువుతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

త్వరలో పోరాటం



మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటు చేయాల్సిందే. ఇందుకు పలుమార్లు ఆందోళనలు చేపట్టాం. ప్రభుత్వాల్లో చలనం లేదు. ప్రభుత్వ కళాశాల సాధనకు విద్యార్థి సంఘాలతో కలసి త్వరలోనే ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం.

– క్యామ శ్రీకాంత్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు, కడ్తాల్

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకుడు, కడ్తాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవశ్యకతను ఎమ్మెల్యేకు వివరించాం. ఎమ్మె ల్యే సైతం సమస్యను ఉన్నత విద్యా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలి. – జి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు, కడ్తాల్


కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

కనుల పండువగా కల్యాణోత్సవం

భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం


ఉత్సవ మూర్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధి గౌరెల్లిలో కొలువైన శ్రీ స్వయంభూ స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి వార్షికోత్సవం వైభవోపేతంగా సాగింది. సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ క్రతువును వీక్షించడానికి గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తండోపతండాలుగా విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపం జనసంద్రంతో కిక్కిరిసింది. ఆలయ అర్చకుడు గోవర్ధనం ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం కొనసాగింది. భక్తుల జయ జయ ధ్వనులతో మాలాధారణ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు దివ్యదాస్, రాజు, రాజేశ్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.